జీతాల కోసం ఎదురుచూపు

- 800 మంది మున్సిపల్ కార్మికులకు అందని మార్చి వేతనం
- జీతాల చెల్లింపులో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఓ ఏజెన్సీ
- ప్రతి నెలా ఇదే తంతు
- ఇబ్బందుల్లో ఉద్యోగులు, కార్మికులు
- పట్టించుకోని అధికారులు



లేబర్ కమిషనర్‌కు సమస్యను విన్నవిస్తున్న కార్మికులు (ఫైల్)

నిజామాబాద్ సిటీ: జీతాల కోసం మున్సిపల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు ప్రతి నెలా ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. వీరికి మార్చి నెల అందాల్సిన వేతనాలు ఇంకా అందలేదు. ఇందులో ఎక్కువగా పేద కార్మికులే ఉన్నారు. వేతనం అందక కుటుంబాన్ని ఎలా నెట్టుకు రావాలో తెలియక సతమతమవుతున్నారు.

నిజామాబాద్ మున్సిపల్‌లో ఓ ఏజెన్సీది ఆడిందే ఆట పాడిందే పాటగా మారుతోంది. మున్సిపల్‌లో 1,280 మంది అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు. ఇందులో 400 మంది మాత్రమే స్వయం సహాయక సంఘాల గ్రూపులకు చెందినవారు. మిగతా 800 మంది ఓ ప్రైవేట్ ఏజెన్సీ చూస్తోంది. సిబ్బందికి సంబంధించి ఆన్‌లైన్‌లో కాంట్రాక్టు దక్కించుకుంది. ఈ ఏజెన్సీకి మెయింటెనెన్స్ కోసం బల్దియా ప్రతీనెల రూ.2.50 లక్షలు చెల్లిస్తోంది.

20 రోజులు అవుతున్నా అందని వేతనం

బల్దియాలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే 800 మంది సిబ్బందికి మార్చి నెల వేతనాలు అందలేదు. ఇతర ఉద్యోగులు ఈనెల 5న వేతనం పొందారు. ఓ ప్రైవేట్ ఏజెన్సీ నిర్వహిస్తున్న ఉద్యోగులకు మాత్రం 20 రోజులైనా వేతనాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందులో పారిశుధ్య కార్మికులు, కంప్యూటర్ ఆపరేటర్లు, పీసీ వర్కర్లు, అటెండర్లు, ఇతర ఉద్యోగులు ఉన్నారు.

ప్రైవేట్ వ్యక్తులకు అప్పగింత

వరంగల్, ఖమ్మం వంటి పెద్ద మున్సిపాలిటీల్లో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల వ్యవహారం ఆయా ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు అప్పగించారు. పనిచేసే కార్మికుల్లోనే 12 నుంచి 15 మందితో కలిసి ఓ గ్రూపు ఏర్పాటు చేసుకుని, వారి ద్వారా ఉద్యోగులను బల్దియాకు కేటాయిస్తే వారి వేతనాలు ఆయా గ్రూపు ఖాతాల్లో బల్దియా జమ చేస్తుంది. ఉద్యోగులు, మున్సిపల్ కార్మికుల మధ్య నేరుగా సంబంధాలుంటాయి. మధ్యవర్తుల వ్యవహారం ఉండదు. ఉమ్మడి జిల్లాలో ఆర్మూర్, బోధన్, భీంగల్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ వంటి మున్సిపల్‌లో ఏజెన్సీలు లేకుండా నేరుగా స్వయం సహాయక సంఘాలకే కేటాయించారు. బల్దియాలో మాత్రం గత రెండేళ్లుగా ఓ ప్రైవేట్ ఏజెన్సీకి ఆ బాధ్యతలు అప్పగించారు. దీంతో ప్రతి నెలా ఇదే తంతు కొనసాగుతోంది.

ఖాతరు చేయలే..

ప్రజా సంఘాల, వామపక్ష నాయకులు, కార్మికులు అవుట్ సోర్సింగ్ ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించవద్దని కోరుతూ బల్దియా కార్యాలయం ఎదుట వారం రోజులు నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. అయినా బల్దియా ఉన్నతాధికారులు మాత్రం యథావిధిగా అదే ఏజెన్సీకి రెన్యువల్ చేశారు.

కార్మికుల సంక్షేమం గాలికి..

బల్దియాలో పనిచేసే సిబ్బందికి కార్మిక హక్కులు ఉంటాయి. చట్టాలు వర్తిస్తాయి. వారికి పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా వంటివి వర్తింపజేయాలి. కానీ, ప్రైవేట్ ఏజెన్సీ అవేమీ పట్టించుకోవడం లేదని ప్రజాసంఘాల నాయకులు మండిపడుతున్నారు.

ఏజెన్సీ నిర్వాహకులను హెచ్చరించాం



అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సంబంధించి సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులను పిలిచి మందలించాం. ప్రతి నెలా 5వ తేదీ లోపు వేతనాలు ఇవ్వాలని ఆదేశించాం. రెండురోజుల్లో వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చారు.

– ఎస్ దిలీప్‌కుమార్, కమిషనర్

జీతం రాక ఇబ్బందిగా ఉంది

మున్సిపల్‌లో పదేళ్లుగా పనిచేస్తున్నా. నా జీతం రూ.15,600. కటింగ్‌లో పోనూ వచ్చేది రూ.14 వేలు. ఇందులో నా కుటుంబాన్ని పోషించుకోవాలి. మార్చి నెల వేతనం ఇప్పటివరకు రాలేదు. దీంతో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వేతనం మొదటి వారంలో వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– నరేంద్రచారి, కంప్యూటర్ ఆపరేటర్, టౌన్‌ప్లానింగ్

జీతం రాకుంటే ఎట్లా బతకాలే

కార్యాలయంలో ప్రైవేట్ ఏజెన్సీలను బంద్ చేయాలి. ఇప్పటి వరకు జీతాలు ఇవ్వలేదు. మేము ఎట్లా బతకాలే. ఏజెన్సీ వారు హైదరాబాద్‌లో ఉంటారు. మా కార్మికులకు ఏ కష్టం వచ్చినా పట్టించుకోరు. ప్రతి నెలా ఇష్టం వచ్చిన టైంకు జీతాలు ఇస్తారు. అధికారులు సమస్యను పరిష్కరించాలి

– లల్లాబాయి, శానిటేషన్ వర్కర్

టైంకు జీతం వచ్చేలా చూడాలి

నేను వాటర్ వర్క్స్‌లో పదేళ్లుగా పనిచేస్తున్నా. మాకు టైంకు జీతం ఎప్పుడూ రాలే. అందరి ఉద్యోగుల మాదిరిగా ప్రతి నెలా 5లోపు జీతాలు ఇవ్వాలి. పిల్లల చదువులు, కుటుంబ పోషణ కష్టంగా మారుతోంది. అధికారులు స్పందించి త్వరగా వేతనాలు ఇచ్చేలా చూడాలి.

– చాంద్‌పాషా, వాటర్‌వర్క్స్ జవాన్

ఇందూరు జిల్లా క్రీడాకారులకు పుట్టినిల్లు

- ఒలింపిక్స్‌లో పతకాలే లక్ష్యంగా క్రీడాకారులు ఎదగాలి
- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే

సుభాష్‌నగర్: ఇందూరు జిల్లా క్రీడాకారులకు పుట్టినిల్లు అని, అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించడం జిల్లాకే గర్వకారణమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో క్రీడా ముగింపు వార్షికోత్సవం 2024–25 నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వివిధ క్రీడల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడమే లక్ష్యంగా ఇందూరు క్రీడాకారులు ఎదగాలని పేర్కొన్నారు.

గిరిరాజ్ కళాశాల విద్యార్థులు క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడం తోపాటు ఒలింపిక్స్‌లో మెడల్స్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. యువత మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండటానికి క్రీడలు అలవాటు చేసుకోవాలన్నారు. ఖేలో ఇండియా, ఫిట్ ఇండియా పేరుతో గ్రామ స్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సాహించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు మౌలిక సౌకర్యాల కల్పనతోపాటు కోచ్‌లను నియమించాలని సూచించారు. ఇందూరు జిల్లాలో స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణ విషయాన్ని అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని, త్వరలో నిర్మాణం జరిగేలా కృషి చేస్తానన్నారు. గిరిరాజ్ కళాశాల పూర్వవిద్యార్థిగా, అర్బన్ ఎమ్మెల్యేగా కళాశాల అభివృద్ధికి తగిన నిధులు ప్రభుత్వం నుంచి వచ్చేలా చూస్తానని, ఈ విషయమై అవసరమైతే పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఇతర కాంగ్రెస్ నాయకులతో కలిసి పని చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రంగారత్నం, పీడీ బాలమణి, అధ్యాపకులు, విద్యార్థులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే కేసీఆర్ కుటుంబం జైలుకు..

రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి: ధరణి పేరుతో భూములు కొల్లగొట్టిన కేసీఆర్ కుటుంబం త్వరలోనే జైలు ఊచలు లెక్కించడం ఖాయమని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి పేర్కొన్నారు. శనివారం డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బి), బర్దిపూర్, మెంట్రాజ్‌పల్లి, దేవుపల్లి క్యాంప్, దేవునగర్ క్యాంప్, అమృతాపూర్, నడిపల్లి గ్రామాల్లో రూ.4.81 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పింకు బుక్కులో ఏం రాసుకున్నా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఏమాత్రం భయపడరని అన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. రాబోయే రెండేళ్లలో మంచిప్ప ప్రాజెక్టు పనులు పూర్తిచేసి నియోజకవర్గంలోని రెండు లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తామని పేర్కొన్నారు. మెంట్రాజ్‌పల్లిలో ఎకరం స్థలంలో పెద్ద కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని, ఈ కమ్యూనిటీ హాల్ గ్రామంలోని అన్ని కుల సంఘాలు ఉపయోగించుకోవచ్చన్నారు. మండల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, శ్రీనివాస్, మునిపల్లి సాయి రెడ్డి, తారాచంద్, రాంచందర్ గౌడ్, చింత శ్రీనివాస్ రెడ్డి, కంచెట్టి గంగాధర్, సీహెచ్ నర్సయ్య, యోహన్, నివేదిత, శ్రీనివాస్‌గౌడ్, వీడీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన జేఏసీ చైర్మన్



నిజామాబాద్‌అర్బన్: ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన సుమన్, నాయకులు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఎన్నికైన నూతన కార్యవర్గ ఉత్తర్వులను కలెక్టర్‌కు అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నాశెట్టి సుమన్ కుమార్, అలుక కిషన్, మోహన్‌రెడ్డి, రమేశ్, రమణారెడ్డి, ధర్మవీర్, బి కృష్ణారెడ్డి, రవీందర్, రామ్మోహన్ రావు, ఉద్యోగులు ఉన్నారు.

ప్రభుత్వ విద్యపై ప్రచారం



ఇందల్వాయి: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఎల్లారెడ్డిపల్లె ఉన్నత పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్ ఉపాధ్యాయులతో కలిసి వినూత్న పద్ధతిలో ప్రచారం చేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం గ్రామంలో ఉపాధి కూలీలు చేస్తున్న పని వద్దకు వెళ్లి ప్రభుత్వ విద్య, పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఎల్లారెడ్డిపల్లె పాఠశాల ప్రతి ఏడాది వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తోందని, ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలని చేర్చి ఆర్థికంగా నష్టపోవద్దని సూచిస్తున్నారు. ఉపాధ్యాయుల ప్రచారాన్ని గ్రామస్తులు అభినందిస్తున్నారు.

రైతు మహోత్సవాన్ని సద్వినియోగం చేసుకోవాలి

డిచ్‌పల్లి: జిల్లా కేంద్రంలో నిర్వహించే రైతు మహోత్సవాన్ని మండల రైతులు సద్విని యోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సుధామాధురి శనివారం కోరారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు మహోత్సవం వేడుకలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఇందుకు నిజామాబాద్ జిల్లాను ఎంపిక చేసిందన్నారు. ఈ నెల 21, 22, 23వ తేదీల్లో మూడు రోజుల పాటు జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ మైదానంలో రైతు మహోత్సవం వేడుక లు జరుగుతాయన్నారు. మండలంలోని రైతు లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రైతు మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అక్రమ కేసులు పెడితే సహించం

నిజామాబాద్ సిటీ: కేంద్ర ప్రభుత్వం సోనియా గాంధీ, రాహుల్‌గాంధీపై ఈడీని అడ్డుపెట్టుకొని అక్రమ కేసులు పెట్టాలని చూస్తోందని దానిని తాము సహించమని యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విపుల్‌గౌడ్ అన్నారు. జాతీయ యూత్ కాంగ్రెస్ పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలోని ఈడీ కార్యాలయం ఎదుట నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విపుల్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూడలేకే కేంద్ర ప్రభుత్వం కాంగ్రెస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టాలని చూస్తోందన్నారు. గాంధీ కుటుంబం త్యాగాల కుటుంబమని వారికి దేశ ప్రజలు మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు.నాయకులు అంజనిగౌడ్, అనుపాల్ కిరణ్, చరణ్ దినేశ్, గడ్కోల్ సంతోష్, వినోద్ పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



మోపాల్: ప్రపంచ ప్రఖ్యాతి పొందిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో ప్రెసిడెన్సీ స్కూల్ 7వ తరగతి విద్యార్థి దేవతి రోనీ శామ్యూల్ చోటు సంపాదించాడని ప్రిన్సిపాల్ పవనకుమార్ తెలిపారు. ఈమేరకు శనివారం రోనీని పాఠశాలలో అభినందించారు. రోనీ సంగీత వాయిద్యమైన కీ బోర్డులో అసాధారణ ప్రతిభ కనబర్చి ఈ ఘనత సాధించాడన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నల్ల శమంత రెడ్డి, రోనీ తల్లిదండ్రులు సువర్ణ కైత, శ్రీనివాస్ దేవతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



ధర్పల్లిలో సీమంతాలు నిర్వహిస్తున్న అధికారులు

ధర్పల్లి: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బీ అన్నారు. మండల కేంద్రంలో ని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. పోషకాహార లోపం వల్ల జరిగే నష్టాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా అన్నప్రాసన, సీమంతాలు, అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో జ్యోతి, మండల వైద్యాధికారులు మౌనిక, అరవింద్, సూపర్‌వైజర్ బుజ్జి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బోర్గాం(పి) అంగన్‌వాడీలో సీమంతాలు

మోపాల్: నగరశివారులోని బోర్గాం(పి) అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు పోషణ ఆహార వారోత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప, మెడికల్ ఆఫీసర్ ప్రత్యూష, డాక్టర్ సంతోష్, సీహెచ్‌వో, హెల్త్ సూపర్‌వైజర్ రవీందర్, ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, గర్భిణులు పాల్గొన్నారు.

గర్భిణులు యోగా చేయాలి

నిజామాబాద్‌నాగారం: సాధారణ ప్రసవాలకు గర్భిణులు ప్రతి రోజు యోగా చేయాలని జిల్లా ఆయుష్ విభాగం ఇన్‌చార్జి గంగాదాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కసాబ్‌గల్లీలో ఉన్న అంగన్‌వాడీలో నిర్వహించిన పోషణ పక్వాడా కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమం డాక్టర్ శ్రీలత, స్వర్ణలత, పురుషోత్తం, ఉమ, ప్రసాద్, స్వప్న, విజయ, రాజేందర్, రమేశ్, గర్భిణులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

నిజామాబాద్ సిటీ: స్త్రీల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా నిర్వహించే మిస్ వరల్డ్ పోటీలను ప్రభుత్వం వెంటనే రద్దుచేయాలని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కోటగల్లి ఎన్ఆర్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మహిళలు, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. కార్యక్రమంలో వక్తలు బెజుగం సుజాత, వి గోదావరి, కె సంధ్యారాణి, ఆకుల అరుణ, ముష్క సుధాకర్, పోసాని, అనసూయ, సత్యక్క, నాగమణి, సవిత, సంజన, అమూల్య, అంజలి, శివరాజు, డాక్టర్ గణేశ్, జన్నారపు రాజేశ్వర్, సతీశ్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని భీమవరం రుచులు హోటల్ సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణపై గన్నారం ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ విక్రమ్ అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ సిబ్బంది, హోటల్ సిబ్బంది పాల్గొన్నారు.

బడిబాట కరపత్రాల ఆవిష్కరణ

మోపాల్: మండలంలోని కంజర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరం బడిబాట కరపత్రాలను హెచ్ఎం బి గోపాలచారి శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, అరుణశ్రీ, రాణి, గోపాలకృష్ణ, కాంతి కిరణ్, ఉమాగౌరి, భూమయ్య, విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

బోర్గాం(పి) జెడ్పీహెచ్ఎస్‌కు అవార్డు

మోపాల్: నగరశివారులోని బోర్గాం(పి) జెడ్పీ ఉన్నత పాఠశాలకు సర్వేజన ఫౌండేషన్ నిర్వహించిన రోడ్ సేఫ్టీ రూల్స్ అవేర్‌నెస్ చాంపియన్‌షిప్–2025 అవార్డు సాధించినట్లు హెచ్ఎం శంకర్ తెలిపారు. హైదరాబాద్‌లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో డీజీపీ జితేందర్ సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. పాఠశాలలో ఫిబ్రవరిలో రోడ్డు సేఫ్టీ రూల్స్‌పై పోటీ పరీక్ష నిర్వహించి సర్వేజన ఫౌండేషన్‌కు సైట్‌లో పంపించామని, రాష్ట్రంలో 1117 పాఠశాలలు ఈ పోటీల్లో పాల్గొన్నాయని హెచ్ఎం తెలిపారు. టాప్ 15 పాఠశాలల్లో బోర్గాం(పి) జిల్లా పరిషత్ ఎంపికైందన్నారు. ఈ విద్యాసంవత్సరం హైబిజ్ టీవీ ద్వారా బెస్ట్ స్కూల్ అవార్డు, సర్వేజన ఫౌండేషన్ ద్వారా మరో అవార్డు పొందడం పాఠశాల ఉపాధ్యాయుల కృషికి నిదర్శనమని డీఈవో అశోక్ అభినందించారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులు వినోద్, వేణు పాల్గొన్నారు.

అగ్నివీర్‌కు సుధాన్ ఎంపిక

నిజామాబాద్ రూరల్: మండలంలోని గాంధీనగర్ తండాకు సుధాన్ అగ్నివీర్‌కు ఎంపికయ్యాడు. దీంతో అదే తండాకు చెందిన రిటైర్డ్ సీఆర్‌పీఫ్ జవాన్ రమేశ్ సుధాన్‌ను శనివారం సన్మానించారు. కార్యక్రమంలో తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

అంజన్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్: ప్రధాని, కేంద్రమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేతలు అంజన్‌కుమార్ యాదవ్, అద్దంకి దయాకర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్నాటి కార్తిక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నగరంలోని రెండో పట్టణ పీఎస్‌లో వారిపై ఫిర్యాదు చేశారు. కార్తిక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అరవై ఏళ్ల పాలన మొత్తం అవినీతి, అక్రమాలు, కుంభకోణాలతో కాలం గడిపేసిందన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌గాంధీ పేర్లు చార్జిషీట్‌లో చేర్చడంతో కాంగ్రెస్ చేపట్టిన నిరసన కార్యక్రమంలో ప్రధాని, కిషన్‌రెడ్డిపై అశ్లీల వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు.

సన్నబియ్యంతో ప్రజల్లో సంతోషం



నిజామాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని రాష్ట్ర మైనార్టీస్ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన గౌతంనగర్‌లో ఉన్న లింబాద్రి ఇంట్లో ప్రభుత్వం సరఫరా చేసిన సన్న బియ్యంతో భోజనం చేశారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బల్దియాలో ఇద్దరు ఉద్యోగులకు పదోన్నతి

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇద్దరు ఉద్యోగులకు ప్రమోషన్లు లభించాయి. ఈ మేరకు ప్రభుత్వం జీవో 214 విడుదల చేసింది. మల్టీజోన్–1లో 11 మందికి గ్రేడ్–2 హోదాలిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కార్పొరేషన్‌లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఖదీర్‌పాషా, శానిటరీ విభాగంలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న పి లలితకు గ్రేడ్–2 అధికారులుగా ప్రమోషన్లు వచ్చాయి. వీరికి ఇంకా పోస్టులు ఖరారు కాలేదు. త్వరలో వీరు రిలీవ్ కానున్నారు.

హిందువులపై దాడులు అమానుషం



నిరసన తెలుపుతున్న నాయకులు

నిజామాబాద్ రూరల్: పశ్చిమబెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు అమానుషమని వీహెచ్‌పీ విభాగ్ ప్రముఖ్ తమ్మల కృష్ణ అన్నారు. శనివారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద విశ్వ హిందూ పరిషత్ బజరంగ్‌దళ్ ఇందూరు జిల్లా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తమ్మల కృష్ణ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో దేశంలో అందరికి సమాన హక్కులు ఉంటాయన్నారు. పశ్చిమబెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని కలెక్టర్ కార్యాలయంలోని ఏవో ప్రశాంత్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు దినేశ్ ఠాకూర్, గాజుల దయానంద్, దాత్రిక రమేశ్, నాంపల్లి శేఖర్, పాతూరి మహేశ్, కొడిమల శ్రీనివాస్, నీకేశ్, సుధీర్, అఖిల్, రాజు, బంజా రమేశ్, శ్యాం, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	96,400	వెండి(కిలో)	1,01,000
22 క్యారెట్స్	88,985	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	16	గాజరుగడ్డ	40	80
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	40	60	దోసకాయ	25	50
దొండకాయ	25	50	ఆలుగడ్డ	25	50
బీర్నిసుకాయ	100	150	గోబిగడ్డ	10	20
కాకరకాయ	50	90	గోబిపువ్వు	25	50
వంకాయ	20	40	బీట్‌రూట్	20	40
పాలకూర	20	40	కరివేపాకు	70	120
మెంతికూర	60	90	చామగడ్డ	50	75
కొత్తిమీర	30	60	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	50	80	మామిడికాయ	20	40

– సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1 ఓదెల-2(తెలుగు)-10.40, 1.30, 4.30, 7.20, 10.20
- స్క్రీన్-2 గుడ్ బ్యాడ్ అగ్లీ(తెలుగు)-11.00, 10.40
- ఒక్కడు(తెలుగు)-1.40, 7.40
- స్క్రీన్-3 అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి(తెలుగు)-11.00, 1.35, 4.30, 7.25, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1 అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి(తెలుగు)-10.00, 1.00, 4.00, 7.00, 10.00
- స్క్రీన్-2 ఓదెల-2(తెలుగు)-10.00, 1.05, 4.10, 7.15, 10.20
- స్క్రీన్-3 పాడింగ్టన్ (హిందీ)-11.05
- జాట్(హిందీ)-1.30
- సిన్నర్స్(ఇంగ్లీష్)-4.40, 7.40, 10.40
- స్క్రీన్-4 డియర్ ఉమ(తెలుగు)-11.00
- ది చూసన్ లాస్ట్ సూపర్(ఇంగ్లీష్)-2.10
- జాక్(తెలుగు)-4.45- పాడింగ్టన్ (ఇంగ్లీష్)-7.40
- మధురం(తెలుగు)-10.05

లలితామహల్ కోర్ట్ (తెలుగు)

దేవి అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (తెలుగు)

నటరాజ్ జాట్(హిందీ), **విజయ్** మ్యాడ్ స్క్వేర్